

పదోన్నతుల పత్రాలు అందజేత

పాలకుర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కేశోరాం సిమెంట్ కంపెనీలో శనివారం 21 మంది బేసిక్ కార్మికులకు పదోన్నతులు కల్పిస్తూ పర్మినెంట్ చేశారు. ఈ సందర్భంగా పదోన్నతుల పత్రాలను పర్మినెంట్ యూని యన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి, అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాడి మహేష్, వర్కింగ్ ప్రసిడెంట్ పర్శవేని శ్రీనివాస్ యాదవ్, క్లబ్ సెక్రటరీ పోతుల ప్రసాద్, పుప్పాల రమేష్, ఏదునూరి నారాయణ, యూనియన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బస్సు ఎక్కేందుకు ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

కళ్యాణ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముగియడంతో ప్రయాణికులు తమ ఊర్లకు తిరుగుముఖం పట్టారు. దీంతో శనివారం బస్టాండ్ ఆవరణ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల కొద్ది బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షించారు. వచ్చిన బస్సుల్లో సీట్ల కోసం పరుగులు తీశారు. కొంతమంది కిటకిటీల నుంచి చిన్న పిల్లలను బస్సు లోపలికి పంపారు. సమయానికి బస్సులు లేకపోవడం, గంటల కొద్దీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందు లు పడ్డారు. కొన్నికొన్ని బస్సుల్లో కెపాసిటీకి మించి ప్రయాణించాల్సి న పరిస్థితి ఏర్పడింది. కరీంనగర్, మంచిర్యాల, భూపాలపల్లి, చెన్నూరు, బెల్లంపల్లి మందమర్రి ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ఇబ్బందులకు గురయ్యారు.



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు



గోదావరిఖని బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

చోరీల నియంత్రణకు డోర్ అలారమ్ తాళాలను వినియోగించండి

- సీపీ శ్రీనివాస్
- యాంటీ థెఫ్ట్ అలారం సిస్టంపై డెమో ప్రదర్శన



యాంటీ తెఫ్ట్ అలారం పని తీరును వివరిస్తున్న సీపీ

8

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- అదనపు కలెక్టర్ వేణు
- పలు గ్రామాల్లో సర్వే పరిశీలన



భూములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

8

గ్రామసభల ఆమోదంతో లబ్ధిదారుల ఎంపిక

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



జీడీనగర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పాలకుర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామసభల ఆమోదంతోనే ప్రభుత్వం చేపట్టబోయే నాలుగు సంక్షేమ పథకాలకు తుది అర్హుల జాబితా ఎంపిక చేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మండలం పరిధిలోని జీడీనగర్ గ్రామంలో జరుగుతున్న రేషన్ కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే పనులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సర్వే త్వరగా పూర్తి చేసి గ్రామ సభలో పథకాల అర్హుల జాబితా వివరాలను ప్రదర్శించాలని అధికారుల ను ఆదేశించారు. గ్రామాల్లో వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. 2023-24 సంవత్సరంలో ఉపాధిహామీ కింద 20 రోజులు పని చేసి ఎటువంటి భూమిలేని రైతుకూలీల కుటుంబాలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి దశలో అత్యంత పేదలకు అవకాశం ఇవ్వాలని సూచించా రు. రేషన్ కార్డులకు సంబంధించి ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ స్థితిగతులను పరిశీలించి అర్హులకు రేషన్‌కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ ఎం జ్యోతి, ఎంపీడీవో అల్లం పూర్ణచందర్‌రావు, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి శుభ్రతపై పర్యవేక్షణ కరువు

పాలకుర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తాగునీటి శుభ్రతపై అధికారుల పర్యవేక్షణ కరువైందని పలువురు ఆరోపిస్తున్నారు. మండలం పరిధిలోని ఈసాలత క్కళ్లపల్లి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చే ఏకైక మంచినీటి బావిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సీసాలను, చెడిపోయిన ప్లాస్టిక్ డబ్బాలను, ఇతర వ్యర్థ పదార్థాలను బావిలో పడేశారు.



ఈసాలతక్కళ్లపల్లిలోని తాగునీటి బావిలో ఉన్న వ్యర్థపదార్థాలు

దీంతో నీరు కలుషితమై నురుగుగా మారడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. సమీపంలోనే ఉన్న వాటర్ ప్లాంట్ వ్యర్థపు నీరు సైతం ఆ బావిలోకే వదులుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి బావిలోని నీటిని తొలగించి రానున్న రోజుల్లో నీటిని కలుషితం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బస్ డిపో ఏర్పాటుకు రూ.11.7 కోట్లు

- పెద్దపల్లిలో త్వరలో ప్రారంభం కానున్న నిర్మాణ పనులు
- అంచనాలను రూపొందిస్తున్న ఆర్టీసీ అధికారులు



బస్ డిపో నిర్మాణంపై ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లికి మంజూరైన బస్ డిపో నిర్మాణానికి రాష్ట్ర ఆర్టీసీ బోర్డు 11 కోట్ల 70 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ జీవో 915 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో త్వరలోనే బస్ డిపో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. డిపోకు కేటాయించిన స్థలంలో గల భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఇతర కార్యాలయాల్లోకి మార్చారు. శనివారం బస్ భవన్‌లో జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పెద్దపల్లి, ములుగు, ఏటూరునాగారం బస్‌డిపోలతో పాటు సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా పెద్దపల్లి బస్ డిపోకు 11 కోట్ల 70 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. బస్ డిపోకు 4.31 ఎకరాల భూమిని కేటాయిస్తూ 2023 సెప్టెంబరు 26న తేదీన కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రొసీడింగ్స్ నంబర్ ఈ1/1629/2024 ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు సర్వే నంబర్ 592లో 36 గుంటల స్థలంలో గల సివిల్ సప్లయ్ గోదాం, సర్వే నంబర్ 589లో ఆరు గుంటల స్థలంలో గల ఎంపీడీవో, ఏడు గుంటల్లో గల ఎంఈవో, ఏడు గుంటల్లో గల డీఆర్‌డీఏ ఆఫీసులు, మూడు గుంటల్లో గల సివిల్ సప్లయ్ కార్యాలయం, నాలుగు గుంటల్లో గల పాడి రైతు శిక్షణ కేంద్రం, 12 గుంటల్లో గల జిల్లా లీగల్ మెట్రాలజీ కార్యాలయం, 14 గుంటల్లో గల మిల్క్ యూనిట్ కార్యాలయం, ఐదు గుంటల్లో గల ఎక్సైజ్ కార్యాలయం, 18 గుంటల్లో గల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం, మూడు గుంటల్లో గల డీఎల్‌పీవో కార్యాలయం, ఎకరం 36 గుంటల ఖాళీ స్థలాన్ని బస్‌డిపో కోసం కేటాయించారు. ఈ స్థలానికి ధరణి పోర్టల్ ప్రకారం ఎకరానికి 2 కోట్ల 83 లక్షల 14 వేల రూపాయలు ఉండగా, మొత్తం 14 కోట్ల 15 లక్షల 70 వేల రూపాయలు చెల్లిస్తే స్థలాన్ని అప్పగించనున్నట్లు కలెక్టర్ టీఎస్‌ఆర్టీసీ ఎండీకి లేఖ రాశారు. గత నెల 4వ తేదీన పెద్దపల్లిలో జరిగిన యువ వికాసం సీఎం సభకు ఒక రోజు ముందే ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఉచితంగా అందజేయనున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 8వ పేజీలో...

● కార్యాలయాల తరలింపు పూర్తి..

డిపో నిర్మాణ స్థలాన్ని ఈ నెల 16న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, కరీంనగర్ రీజినల్ మేనేజర్ రాజు, తదితరులు పరిశీలించారు. వాటి ఆవరణలో గల మండల పరిషత్, మండల విద్యావనరుల కేంద్రం, ఐకేపీ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, తదితర శాఖల కార్యాలయాలను ఈ నెల 10వ తేదీ లోగా ఖాళీ చేయాలని ఆదేశించడంతో అన్ని కార్యాలయాలు శనివారం ఖాళీ చేశారు. ఆ స్థలాన్ని కలెక్టర్ టీజీఎస్ ఆర్టీసీకి అప్పగించారు. దీంతో ఆర్టీసీ బోర్డు నిధులు మంజూరు చేసింది. ఒకటి, రెండు రోజుల్లో ఆర్టీసీకి చెందిన సివిల్ ఇంజినీరింగ్ అధికారులు స్థలాన్ని, ఇక్కడ ఉన్న భవనాల్లో ఎన్ని డిపో కోసం సద్వినియోగం అవుతాయి.. ఎన్నింటిని కూల్చి వేయాలనే విషయమై పరిశీలించి అంచనాలు తయారు చేయనున్నారు. అవసరం లేని భవనాలను కూల్చి నిర్మాణ పనులను చేపట్టనున్నామని ఆర్టీసీ ఆర్‌ఎం రాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గానికి సంబంధించిన 368 మంది లబ్ధిదారులకు కోటి 12 లక్షల ఏడువేల ఐదు వందల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంవత్సరం కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో పెద్దపల్లి నియోజకవర్గానికి దాదాపు వెయ్యి కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులను మంజూరు చేయించినట్లు తెలిపారు. రానున్న కాలంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, తహసీల్దార్ రాజ్ కుమార్, నాయకులు నూగిళ్ల మల్లయ్య, మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, కడర్ల శ్రీనివాస్, రాజేశ్వర్ రెడ్డి, భూతగడ్డ సంపత్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెద్దపల్లి పట్టణంలో టీయూఎఫ్ఐడీసీలతో చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి జెండాచౌరస్తా వరకు జెండా చౌరస్తా నుంచి సుభాష్ నగర్ చౌరస్తా వరకు జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని గుత్తేదారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మున్సిపల్ నూతన కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్, ఎస్ఐ లక్ష్మణరావు, నూగిల్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బయో మెడికల్ వ్యర్థాలను వేరుచేయాలి: డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి వెలువడే బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేసి సంబంధిత బయో మెడికల్ వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాలకు అందించాలని డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గోదావరిఖని, మంథని, పెద్దపల్లి, ధర్మారం, సుల్తానాబాద్‌లలో గల ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్స్, ల్యాబరేటరీస్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించామని తెలిపారు. ఆయా కేంద్రాల నుంచి వెలువడే బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేసి అందించాలని సూచించినట్లు తెలిపారు. వ్యర్థాలను సాధారణ చెత్తలో కలుపకూడదని హెచ్చరించారు. ధరల పట్టిక, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేట్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డాక్టర్స్, స్టాఫ్ వివరాల పట్టికను అందరికి కనపడేలా ప్రదర్శించాలని సూచించారు.

గ్రంథాలయంలో అందుబాటులో పుస్తకాలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో పాఠకులకు కావలసిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి కరుణ కుమారి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠకులను గ్రంథాలయ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రూప్స్ కోసం చదువుకునే నిరుద్యోగులకు కూడా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని పుస్తకాలు అవసరమనుకుంటే గ్రంథాలయంలో పుస్తకాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో లైబ్రరీన్ సిబ్బంది గఫార్, సంపత్, సదానందం పాల్గొన్నారు.

గ్రామసభలు విజయవంతం చేయాలి

ఎలిగేడు, జనవరి 18,(ఆంధ్రజ్యోతి): గ్రామసభలను విజయవంతం చేయాలని అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలో రైతు భరోసా, ఇందిరమ్మ గృహాలు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, తెల్ల రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపికపై నిర్వహించే గ్రామసభలను విజయవంతం చేయాలని తహసీల్దార్ బషీరోద్దీన్, ఎంపీడీవో భాస్కర్‌రావు వేరువేరు ప్రకటనలో కోరారు. ఈనెల 21న లోకపేట, నారాయణపల్లి, బురహాన్‌మియాపేట్, 22 న ధూళికట్ట, నర్సాపూర్, రాములపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి, శివపల్లి, 23న ముప్పిరితోట, ఎలిగేడు, సుల్తాన్‌పూర్ గ్రామసభలు ఉంటాయని తెలిపారు.

రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ఖని జనరల్ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

కళ్యాణ్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వైద్యులు విధినిర్వహణలో సమయానికి రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం గోదావరి ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని, అవసరమైన శస్త్ర చికిత్సలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఆసుపత్రి పరిస రాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగ్గా పారిశుధ్య పనులను నిర్వహించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రిలోని లేబర్ రూమ్, ఎంఐసీయూ, మెడికల్ వార్డు, ఐసీయూలను పరిశీలించారు.

● డిపార్ట్‌మెంట్‌లో లేని హెచ్‌వోడీలు

కలెక్టర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో హెచ్‌వోడీలు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది సమయం కాకముందే విధుల నుంచి వెళ్లిపోవడంపై కలెక్టర్ వివరాలను ఆరా తీశారు.

● నర్సింగ్ కళాశాల సందర్శన

ఇటీవల నూతనంగా ప్రారంభించిన నర్సింగ్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనపై వివరాలను ఆరా తీశారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ప్రొఫెసర్లు రాజు, రేణుక, అశోక్, అప్పారావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ సుశీల, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

'మాల నాయకులపై కేసులు నమోదు చేయాలి'

పెద్దపల్లిటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) మాదిగ ఉపకులాల వర్గీకరణకోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న మంద క్రిష్ణ మాదిగపై చేసిన వ్యాఖ్యలను సుమోటాగా తీసుకొని మాల నాయకులపై కేసులు నమోదు చేయాలని వివిధ పార్టీలకు చెందిన మాదిగ నేతలు మామిడిపల్లి బాపయ్య, పల్లె సదానందం, మల్లారపు అరుణ్ డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగ ఉపకులాల వర్గీకరణలో భాగంగా రిజర్వేషన్ల అమలు అధికారాలను ఆయా రాష్ట్రాలకు సుప్రీంకోర్టు అప్పగించిందన్నారు. అయినప్పటికీ తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ ఆ దిశలో అడుగులు వేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. మందక్రిష్ణ చేస్తున్న న్యాయపోరాటాని రాష్ట్రంలోని అన్ని బీసీ ఇతర సంఘాలు మద్దతుగా నిలిచాయని, వర్గీకరణను అడ్డుకుంటే మాలలు ఒంటరి వారవుతారని అన్నారు. మంది క్రిష్ణ మాదిగ ప్రాణాలకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి కాపాడుకుంటామని స్పష్టం చేశారు. పెద్దపల్లికి మందక్రిష్ణ మాదిగ రానున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలలోని మాదిగ నేతలు తరలిరావాలని వారుపిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వడకాపురం ఆనంద్, కుక్క వంశీ, కట్కూరి సందీప్, బండ కరుణాకర్, చిలుముల కుమార్, సింధే శివసాయి, బొంకురి సాగర్, చిపకుర్తి సతీష్, కీసరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'నవోదయ' ప్రవేశపరీక్ష

చొప్పదండి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 6,806 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 5,064 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 1,742 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 74.4శాతం మాత్రమే పరీక్ష రాశారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ మంగ తాయారు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌యూ పీజీ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల రుసుమును జనవరి 29లోపు చెల్లించాలని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగప్రసద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016-2017 సంవత్సరం కోర్సుల్లో చేరిన వారికి ప్రత్యేక రుసుముతో ఒకసారి అవకాశం కల్పించినట్టుగా తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మేడిపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రంగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13,820 స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కరీంనగర్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుబ్బపల్లిలో శనివారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేసి మూడు క్వింటాళ్ళ రేషన్‌బియ్యం పట్టుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేర కు సాగర్ అనే వ్యక్తి ఇంట్లో డిప్యూటీ తహసీల్దార్ సురేందర్, ఇన్‌స్పెక్టర్ మధు తనిఖీ చేశారు. ఇంట్లో నిల్వ ఉంచిన మూడు క్వింటాళ్ళ రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకుని సాగర్‌పై కేసు నమోదు చేశారు.



భారత మహిళల ఖోఖో జట్టుతో నరేష్

గ్రామ స్థాయి నుంచి.. జాతీయ స్థాయికి..

● భారత మహిళా ఖోఖో జట్టు కోచ్‌గా రాణిస్తున్న నరేశ్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన, కఠోర శ్రమతో భారతదేశ ఖో..ఖో.. జట్టుకు కోచ్‌గా శిక్షణను అందిస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నాడు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇస్లావత్ నరేష్. గతంలో క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన ఇస్లావత్ నరేష్ ఖో ఖో క్రీడా కారుడిగా అంచెలంచెలుగా ఎదిగి భారత మహిళల ఖో ఖో జట్టుకు శిక్షకుడిగా ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరుగుతున్న మొదటి ప్రపంచ కప్ ఖో ఖో పోటీల్లో భారత మహిళల జట్టుకు కోచ్‌గా సేవలందిస్తున్నాడు. నరేష్ హుస్నాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. అతడి ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె సదానందం ఖో ఖోలో శిక్షణ అందించాడు.

● జాతీయ స్థాయిలో పతకాలు



సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ఖో ఖో క్రీడా అకాడమీ కోచ్‌లు అతడికి అకాడమీలో ప్రవేశం కల్పించారు. 2000-2002 సంవత్సరం వరకు నరేష్ అకాడమీలో శిక్షణ పొందుతూ ఇంటర్ విద్యను పూర్తి చేశాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి 2002లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో నరేష్ పాల్గొన్నాడు. 2004లో తెలంగాణ రాష్ట్ర సీనియర్స్ ఖో ఖో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కాంస్య పతకం సాధించి పెట్టాడు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 30 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం.

● స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం

ఖో ఖో క్రీడాకారుడిగా ప్రతిభ చాటుతూ 2004లో స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. 2009లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయ ఖో ఖో పోటీల్లో సీనియర్స్ రైల్వే జట్టులో పాల్గొని బంగారు పతకం సాధించడంలో ముఖ్య పాత్ర పోషించాడు. 2015లో బెంగళూరు ఎన్‌ఐఎస్ సెంటర్‌లో కోచ్‌గా శిక్షణ పూర్తి చేసి 2016లో సౌత్ సెంట్రల్ రైల్వే జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా విధులు నిర్వహించాడు. 2018 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ సీనియర్స్ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరి స్తున్నాడు. 2024 రైల్వే సౌత్ సెంట్రల్ జట్టుకు, భారత రైల్వే జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు.



ఇస్లావత్ నరేశ్

● ప్రపంచ కప్‌లో..

2024 మహారాష్ట్రలోని పూణేలో జరిగిన అల్టిమేట్ ఖో ఖో పోటీల్లో చెన్నై క్విక్ గన్స్ జట్టుకు నరేష్ కోచ్‌గా వ్యవహరించి పలువురి మన్ననలను అందుకున్నాడు. అనంతరం ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నరేష్‌ను ప్రపంచకప్‌లో పాల్గొనే భారత మహిళల జట్టుకు కోచ్‌గా నియమించింది. దీంతో నరేష్ 30 రోజుల పాటు ఢిల్లీలో ఉండి భారత మహిళా జట్టుకు శిక్షణను అందించాడు. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ కప్ ఖో ఖో పోటీల్లో నరేష్ తన సేవలను అందిస్తూ అందరి ప్రశంసలను అందుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



చంద్రారెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై బైకుపై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన గోలి చంద్రారెడ్డి(59) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై తన పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కొత్తపల్లి స్టేజీ వద్ద ఉదయం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళుతున్న (ఏపీ09సీ డబ్ల్యూ0014) కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. చంద్రారెడ్డి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రారెడ్డి భార్య గోలి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ..

జగిత్యాల క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ మహిళ శుక్రవారం రాత్రి మృతి చెందింది. పట్టణంలోని బేడబుడుగ జంగాల కాలనీకి చెందిన తుర్పాటి తిరుపతమ్మ(40) అనే మహిళ ప్రధాన రహదారి దాటు తుండగా కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఢీ కొట్టాడు. దీం తో తిరుపతమ్మకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తిరుపతమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరుపతమ్మ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కరీంనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి నుంచి కరీంనగర్ వెళ్తున్నాడు. అదే సమయంలో సుల్తానాబాద్ శ్రీరాంనగర్‌కు చెందిన అబ్దుల్ కరీం అనే వ్యక్తి సైకిల్‌పై వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కిందపడి గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై మండలానికి చెందిన ఓ యువకుడు శనివారం ఉదయం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ వివరాల ప్రకారం.. ఎండపల్లికి చెందిన మానుపాటి రమేశ్ (38)కు 20 ఏళ్ల క్రితం చొప్పదండి మండలం వెదురుకట్ట గ్రామానికి చెందిన పద్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. 2017లో పద్మ తన భర్త రమేశ్‌పై వరకట్నం కేసు కూడా పెట్టింది. రమేష్ కొన్ని రోజులు భార్యతో వెదురుకట్టలో కలిసి ఉన్నాడు. తమ సొంత గ్రామమైన ఎండపల్లికి వెళ్లి ఉందామని భార్యను అడగగా ఆమె అంగీకరించలేదు. దీంతో రమేశ్ ఒక్కడే సొంత గ్రామానికి వెళ్లి ఉంటున్నాడు. నాలుగు నెలలుగా రమేశ్ మానసిక పరిస్థితి సరిగ్గా ఉండడం లేదు. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని యువతి..

కోనరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాకు చెందిన యువతి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గోవిందరావుపేట తండాకు చెందిన బానోతు గంగోత్రి (23) ఫిట్స్, మతిస్థిమితం లేక బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూపించిన నయం కాలేదు. పది రోజులుగా విపరీతమైన తలనొప్పితో బాధపడుతోంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం దూలానికి ఉరేసుకుంది. గంగోత్రి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

బీరు బాటిల్‌లో రబ్బర్ ముక్క

జగిత్యాలరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్‌లో గల ఓ వైన్స్ దుకాణంలో శనివారం మధ్యాహ్నం ఓ బీర్ బాటిల్‌లో రబ్బరు ముక్క గమనించిన కొనుగోలుదారుడు వైన్స్ యజమానులను ప్రశ్నించాడు. పలువురు యవకులు ఓ వైన్స్‌లో ఆర్‌సీ బీర్లను కొనుగోలు చేసి చూడగా బీర్‌లో రబ్బర్ ముక్క రావడంతో అవాక్కయ్యారు. వెంటనే కొనుగోలుదారుడు వైన్స్‌కి వచ్చి నిర్వాహకులను ప్రశ్నించాడు. దీంతో వైన్స్ నిర్వాహకుడు పొంతనలేని సమాధానాలు చెప్పడమేకాకుండా బాధ్యతారహితంగా వ్యవహరిం చారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు విచారణ జరిపి సదరు వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు.

కొండగట్టు ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రావు

మల్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా టి.శ్రీకాంత్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఈవో రామకృష్ణరావు హైదరాబాద్‌లో నిగణేష్ టెంపుల్‌కు బదిలీ కాగ ఆయన స్థానంలో వేములవాడ ఈవో వినోద్ ఇన్నాళ్ల ఇన్‌చార్జీగా విధులు నిర్వహించారు. వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండో మెంట్ డిప్యూటి కమిషనర్ టి.శ్రీకాంత్‌రావును ఈ నెల 7న కొండగట్టు ఈవోగా నియమించడంతో శనివారం విధుల్లో చేరారు. అంతకు ముందు నూతన ఈవో స్వామి వారి సన్నిధిలో పూ జలు నిర్వహించి దేవస్థానం పరిసరాలు పరిశీలించారు. కొండపై అధికారులతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొ న్నారు. ఆక్రమణకు గురవుతున్న భూముల వివరాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహరనాథ్ పాల్గొన్నారు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో శ్రీకాంత్‌రావు



ధర్మపురిలో మాట్లాడుతున్న ఏపూరి సోమన్న

ఎస్సీ వర్గీకరణ పోరాటానికి కదిలి రావాలి

ధర్మపురి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాటం చేసేందుకు ప్రతీ ఒక్కరు కదిలి రావాలని ప్రముఖ కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వేయి గొంతుకలు, లక్ష డప్పులు మాదిగల మహా ప్రదర్శన కోసం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమన్న మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగలు నిర్వహించే పోరాటానికి ప్రతీ ఒక్కరు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ నిర్వహించే పోరాటానికి అడ్డుపడే స్వార్థపరుల కుట్రలను మాదిగ జాతి తిప్పికొట్టాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా చేస్తున్న వర్గీకరణ పోరాటానికి మద్దతు ప్రకటించి ముందుండాలన్నారు. అంతకు ముందు ఆయన అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో వేయి గొంతుకలు, లక్ష డప్పులు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఒల్లాల వాణి, జిల్లా కో ఆర్డినేటర్ ప్రముఖ కళాకారులు రామంచ భరత్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ర లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, రాష్ట్ర నాయకులు రాజమల్లయ్య, లక్ష్మణ్, అమూల్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జట్టు సత్తా చాటాలి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు సత్తా చాటాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. శనివారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడాకారులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని సూచించారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జాతీయస్థాయిలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నామన్నారు. కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసవని లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీ ల్లో 10 ఉమ్మడి జిల్లాల నుంచి 200మంది క్రీ డాకారులు, 50 మంది అధికారులు పాల్గొంటున్నారని అన్నారు. వీరందరికీ మూడు రోజుల పాటు ఉచిత వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, డీవైఎస్ఓ శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ పరిశీలకులు దీపక్ ప్రసాద్, జుంజుపల్లి వివేక్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, జిల్లా సంఘ కోశాధికారి కనకయ్య, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘ రెప్రిస్ బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

● అనుమానాస్పదుడిగా భావించి దాడి చేసిన స్థానికులు



రాజేందర్(ఫైల్)

వేములవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద వ్యక్తిగా భావించి స్థానికులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ నెల 15వ తేదీ బుధవారం తెల్లవారుజామున వేములవాడ పట్టణంలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా జెండా వెంకటాపురం గ్రామానికి చెందిన ఎసుకూరి రాజేందర్ (27) అనే యువకుడు ఈనెల 15వ తేదీ తెల్లవారుజామున తన స్నేహితులతో కలిసి రాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం బైక్‌పై వస్తూ దారితప్పి భగవంతరావునగర్‌లోని తాటికొండ రాజయ్య ఫంక్షన్ హాల్ వైపునకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొందరు యువకులు వారిని అడ్డగించి ఎవరంటూ ప్రశ్నించారు. సమాధానం చెప్పేందుకు తడబడడంతో దొంగలుగా భావించిన స్థానికులు చితకబాదారు. తాము ఫలానా చోట పనిచేస్తున్నామని చెప్పిన వినకుండా విచక్షణారహితంగా చితక బాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన రాజేందర్‌తోపాటు మరొకరిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. నాలుగు రోజులుగా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేందర్ శనివారం మృతి చెందినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పదేళ్ల కింద తల్లిదండ్రులను కోల్పోయిన రాజేందర్ పనులు సరిగా లేకపోవడంతో జీవనోపాధి కోసం మామిడి తోటలో పనిచేసేందుకు 15 రోజుల క్రితమే వేములవాడకు వచ్చాడని తెలుస్తోంది. ఇదిలా ఉండగా అనుమానాస్పద వ్యక్తులుగా భావిస్తూ స్థానిక యువకులు కొందరు విచక్షణారహితంగా దాడికి దిగి ఒకరి మృతికి కారణమైన ఘటనను పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ దాడిలో పాలుపంచుకున్న యువకుల వివరాల కోసం సీసీ ఫుటేజీని పరిశీలించామని, నిందితులను గుర్తించామని, వారిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టామని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంచలనాలకు చిరునామా బడే చొక్కారావు

మంథని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో తూర్పు అడవుల్లో విప్లవోద్యమాన్ని ఉరకలెత్తించినమావోయిస్టు రాష్ట్ర పార్టీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్న మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు. ఎన్‌కౌంటర్‌లో దామోదర్ మృతి చెందినట్లు మావోయిస్టు పార్టీ అధికారికంగా శనివారం ప్రకటన విడుదల చేఇంది. మంథని నియోజకవర్గ సరిహద్దుకు సమీపంలో ఉన్న ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ యువకుడిగా ఉన్నప్పుడే మావోయిస్టుల్లో చేరారు. తొలుత ఏటూరు నాగారం దళంలో సభ్యుడిగా పని చేసిన చొక్కారావు మహదేవపూర్-ఏటూరు నాగారం ఎల్‌జీఎస్ కమాండ్‌గా నియమితుల య్యారు. ఈక్రమంలోనే మహదేవపూర్ పోలీసుస్టేషన్‌ను బస్సు బాంబ్‌తో పేల్చి వేసిన ఘటనలో కీలక పాత్ర పోషించారు. కాటారంలో ఫారెస్టు గెస్టుహౌజ్, ఎంపీడీవో ఆఫీసులను పేల్చివేయడం, పోలీసు ఇన్‌ఫార్మర్ల పేరుతో అనేక మంది పై దాడులు, కొందరిని చంపిన సంఘటనలు, పలు ఎన్‌కౌంటర్లలో తృటిలో తప్పించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో నితూర్పు డివిజన్‌కమిటీ కార్యదర్శిగా, ఖమ్మం-కరీంనగర్-వరంగల్ (కేకేడబ్ల్యూ పీ) కమిటీ కార్యదర్శిగా, జయశంకర్ భూపాలపల్లి-ములుగు-వరంగల్-పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) కమిటీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ గా గత ఏడాది జనవరి నెలలోనే బడే చొక్కారావును పార్టీ కేంద్ర కమిటీ నియమించింది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతి చెందారు. దీంతో దామోదర్ 30 ఏళ్ల విప్లవోద్యమ జీవితం ముగిసింది.



బడే చొక్కారావు అలియాస్ దామోదర్(ఫైల్)

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ



కాపర్‌వైరు చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

గంగాధర, జనవరి 18 (ఆంధ్రజ్యో తి): గంగాధర మండలం ఉప్పరమల్యాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరమల్యాలో వ్యవసాయ సాగు పంపు మోటర్ల కోసం ఎస్ఎస్ 15 నంబరు గల 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌పార్మర్‌కు నాలుగు బావుల మోటర్లు నడుస్తుంటాయి. కాగా శుక్ర వారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌పార్మర్‌ను కిందపడేసి అందులోని కాప ర్ వైరును ఎత్తుకెళ్లారు. ఉదయం పొలానికి నీరు పెట్టడానికి వచ్చిన రైతులు మోటర్ ఆన్ చేయగా కరెంటు సరఫరా లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు కొట్టేసి ఉంటుందనే అనుమానంతో అక్కడికి వెళ్లి చూశారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందపడేసి ఉండడంతో విషయాన్ని ఏఈ రాంమోహన్‌కు తెలియజేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

● చికిత్సపొందుతూ యువకుడి మృతి

ముత్తారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బండ రామకృష్ణ (32) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండ రామకృష్ణ అనే యువకుడు పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో డబ్బులు రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీంతో ప్రతిరోజు ఇంట్లో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తొమ్మిదో తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య మానస, కుటుంబసభ్యులు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది.. పుష్య మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల పూజలు

మల్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ కుటుంబసమేతంగా అంజన్నను దర్శించుకున్నారు

● కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కొండగట్టు అంజన్న సన్నిధికి వచ్చె భక్తుల సౌకర్యార్థం ఆరు సిమెంట్ బెంచీలను అందజేశారు. ట్రస్టు నిర్వహకులు గంగిశెట్టి జగదీశ్వర్ పాల్గన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ఎ వజీర్

ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గణేశ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 సెంట్రల్ అధ్యక్షుడు వజీర్ అన్నారు. శనివారం యూనియన్ కరీంనగర్ రీజియన్ మొదటి జనరల్ బాడీ సమావేశం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. కొత్తగా యూనియన్‌లోకి వచ్చిన కార్మికులను ఆయన ఆహ్వానించారు. ఈసందర్భంగా వజీర్ మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రెటరీ జమీరుద్దీన్ సిద్ధికి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, కోశాధికారి నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, నగేష్, శ్రీనివాస్, మూర్తి, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

- కరీంనగర్ జైలులో 'మై నేషన్' బ్రాండ్‌తో ఉత్పత్తి
- ఆలయాల్లో పూజకు వాడిన పూల వినియోగం
- త్వరలో పూర్తిస్థాయి ఉత్పత్తి



మై నేషన్ అగరబత్తుల పాకెట్‌ను కలెక్టర్ పమేలా సత్పతికి అందిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా

వేస్ట్ టు వెల్త్ కింద అగరు బత్తుల తయారీ

కరీంనగర్ క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలులో అగరు బత్తీల తయారీని జైళ్ల శాఖ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఆలయాల్లో వాడిన పూలతో జైలులోని ఖైదీలతో ఈ అగరు బత్తీల తయారీని చేపట్టింది. ఈ జైలులో ఇప్పటికే ఫర్నిచర్ ఇండస్ట్రీ, ఫినాయిల్, మాస్కుల తయారీలతోపాటు నర్సరీ, మే నేషన్ పేరిట కరీంనగర్‌లో రెండు పెట్రోల్ బంక్‌లను నిర్వహిస్తున్నారు. జిల్లా జైలులో 300కు పైగా ఖైదీలు ఉన్నారు. వారికి జైలులో వివిధ వృత్తుల్లో శిక్షణ ఇస్తూ విడుదల అయిన తరువాత వారు సొంత కాళ్ళపై నిలబడి ఉపాధి పొందేందుకు మార్గం చూపుతున్నారు. కొందరు ఖైదీలు జైలులోనే స్టీల్ ఫర్నీచర్ ఇండస్ట్రీ, నర్సరీ, మాస్కుల తయారీ, ఫినాయిల్ తయారీతో ఉపాధి పొందుతున్నారు. తాజాగా అగరు బత్తీల తయారీని చేపట్టారు. అగరు బత్తీల తయారీకి ప్రధానంగా ముడి సరుకు పూలు.. ఈ పూలను దేవాలయాల నుంచి సేకరించాలని జైళ్ల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా జైలులో అగరు బత్తీల తయారీకి అవసరమైన పూలను వేములవాడ, స్థానిక ఆలయాలు, పూల వ్యాపారుల నుంచి సేకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు వేములవాడ ఆలయం, స్థానికంగా ఉన్న వివిధ ఆలయాలతోపాటు పూలవ్యాపారులతో చర్చించారు.



● తయారీ ఇలా..

ఆలయాల్లో ఉపయోగించిన పూలు, భక్తులు సమర్పించే పూల దండలు, వ్యాపారుల వద్ద వాడిపోయిన పూలను జైలు సిబ్బంది నిత్యం సేకరిస్తారు. ఆ పూలను శుభ్రపరచి వారం రోజులపాటు ఆరబెడతారు. ఎండిన పూలను పొడిగా మార్చి అగరు బత్తీలుగా తయారు చేస్తారు. మార్కెట్‌లో లభించే అగరు బత్తీలు బొగ్గు, ఇతర రసాయాలతో తయారు చేస్తుంటారు. జైలులో తయారు చేసే అగరుబత్తీలు సహజసిద్ధంగా పూలతో తయారు చేస్తుండడం, ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని జైలు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవుడికి ఉపయోగించి తొలగించిన పూలతో టీటీడీ అగరు బత్తీల తయారీని చేపట్టింది. ఇదే స్ఫూర్తిగా తీసుకుని జైళ్లశాఖ కరీంనగర్ జిల్లా జైలులో మొట్టమొదటిసారిగా అగరుబత్తీల తయారీకి శ్రీకారం చుట్టింది.

● 'మై నేషన్' అగరు బత్తుల విడుదుల

మై నేషన్ బ్రాండ్ పేరుతో ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ ఫ్లవర్ ఇన్‌సెన్స్ స్టిక్స్‌ను జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి శనివారం విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా జైలులో జరిగిన ఒక కార్యక్రమంలో మై నేషన్ అగరుబత్తీల ప్యాకెట్లను మార్కెట్‌లోకి విడుదల చేస్తూ మొదట అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తయారీ విధానాన్ని డీజీ పరిశీలించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐజీ మురళిబాబు, డీఐజీ ఎం సంపత్, జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్, వైద్య అధికారి కె వేణుగోపాల్, జైలర్లు పి శ్రీనివాస్, బి రమేష్, యు పరుశరాం, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్, ఎస్ అజయ్‌చారి, ఎన్ సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.



అగరు బత్తీలను పరిశీలిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా

ఇంటర్నెట్ సేవలు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి



టీపీ ఫైబర్‌ను పరిశీలిస్తున్న ఎండీ వేణుప్రసాద్

ముత్తారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిముత్తారంలో నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని టీ ఫైబర్ సంస్థ ఎండీ వేణుప్రసాద్ అధికారులను ఆదేశించారు. గత నెల ఇంటింటికి ఇంటర్నెట్ పైలెట్ ప్రాజెక్టు కింద అడవి శ్రీరాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్‌బాబు ఆదేశానుసారం శనివారం అడవి శ్రీరాంపూర్ గ్రామాన్ని టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్ సందర్శించారు. ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఎలా జరుగుతుంది.. నాణ్యతలో ఏమైనా లోపాలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుప్రసాద్ గ్రామంలో అంతరాయం లేకుండా నాణ్యమైన ఇంటర్నెట్ మరియు టీవీ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజి, అధికారులు ప్రణవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలోకి ఒరిగిన లారీ

మంథని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్స్ భారీ లోడుతో ఉన్న లారీ స్థానిక అంబేద్కర్ చౌక్‌లో ప్రధాన రహదారిలో ఉన్న డ్రైనేజీలో శనివారం దిగబడింది. షాప్ వద్ద అన్‌లోడ్ చేయటానికి వెళ్తున్న క్రమంలో రోడ్డు కింది భాగంలో ఉన్న డ్రైనేజీ పైకప్పు అధిక బరువు కారణంగా పగిలిపోయి వెనుక భాగం టైర్లు అందులో దిగబడిపోయాయి. దీంతో ఒక్కసారిగా లారీ ఎడమవైపు పూర్తిగా వంగిపోయింది. పక్కన రోడ్డుపై ఉన్న పూలబండిలపై ఒరిగింది. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈసమయంలో అక్కడే ఉన్న పూల షాపుల నిర్వాహకులు, ప్రజలు, వాహనదారులకు ప్రమాదం తప్పింది. పోలీసులు వచ్చి లారీని, ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

అటవీ భూములను సంరక్షించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 18 (ఆంధ్ర జ్యోతి) : మండలంలో సర్వే చేపట్టి అటవీ, ప్రభుత్వ భూములను సంరక్షించాలని గ్రా మాల్లోని ప్రజలు డిమాండ్ చేశారు. శనివారం మెట్‌పల్లి ఫారెస్ట్ అధికారులు షౌకత్ అలీ, అరుణ్ కుమార్, చైతన్యశ్రీలకు మాజీ ఎంపీపీ పాలెపు నీలమ్మ ఆధ్వర్యంలో ఆత్మ కూర్, ఆత్మనగర్ గ్రామాల్లోని ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల చుట్టూ ఉన్న వంద ల ఎకరాల్లో ఉన్న అటవీ భూములను కొందరు అక్రమదారులు చెట్లను తొలగించి చదును చేసుకుంటూ కబ్జా లకు పాల్పడుతు న్నారన్నారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించి మొక్కలు నాటాలన్నా రు. త్వరలోనే గ్రామాల్లో పర్యటించి భూము లను సంరక్షించాలని అధికారులను కోరామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామాల్లోని నాయకులు చౌటుపల్లి అంజయ్య, నేరెళ్ల శ్రీధర్, కేసీరెడ్డి నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, రాజారెడ్డి, పాల్గొన్నారు.

కల్వర్టుపై నీటి ప్రవాహం

» గుంతలు పడి ప్రమాదకరంగా మారిన వంతెన



కల్వర్టుపై నుంచి పారుతున్న నీటిలో నుంచి వెళుతున్న వాహనదారులు

కోనరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో లో లెవెల్ వంతెన నిత్యం నీరు పారుతుండడంతో వరద తాకిడికి గుంతలు ఏర్పడి కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సిరిసిల్ల నుంచి కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో కొన్నేళ్ల క్రితం నిర్మించినలో లెవెల్ వంతెనపై మల్కాపేట రిజర్వాయర్ నీరు నిత్యం ప్రవహిస్తోంది. వర్షాకాలంలోనూ వరద ఉధృతి ఎక్కువ. దీంతో లో లెవెల్ వంతెన కొట్టుకుపోయి గుంతలుగా మారింది. రోజు నీరు ప్రవహిస్తుండడంతో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమా దాలకు గురవుతు న్నారు. అధికారులు పాలకులు స్పందించిలో లెవెల్ కల్వర్టుకు నిధులు మంజూరు చేయాలని, హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

అపస్మారక స్థితిలోకి డ్రైవర్

● ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



డ్రైవర్‌ను పరామర్శిస్తున్న డీఎం

మెట్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. టీజీ 02 యూబి 0228 నెంబర్ గల బస్సు మెట్‌పల్లి నుంచి రాయికల్ వెళ్తుండగా పాత బస్టాండ్ వద్ద డ్రైవర్ సతీష్ ప్రయాణికుల కోసం బస్సును ఆపాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా డ్రైవర్ అపస్మారక స్థితిలోకి వెళ్లి సీట్‌పై పడిపోయాడు. గమణించిన ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌ను అంబులెన్స్‌లో ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. తినకపోవడం వల్ల నీరసం వచ్చి కళ్లు తిరిగి పడిపోయినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎం దేవరాజు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డ్రైవర్‌ను పరామర్శించారు. ప్రస్తుతం డ్రైవర్ పరిస్థితి నిలకడగా ఉందని, మరో డ్రైవర్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చారు.



త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పంచరత్న గానం వినిపిస్తున్న శ్రీవిద్య బృందం

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామిక్షేత్రంలో త్యాగరాజస్వామి 72వ ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆరాధనోత్సవాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు తెల్లవారు జామున ఉదయం 5.45 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము నిర్వహించారు. ఉదయం 7.25 గంటలకు త్యాగరాజస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నగర సంకీర్తన చేపట్టారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహేష్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి జీవిత చరిత్ర విశేషాలు వివరించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీవిద్య బృందం పంచరత్న గానం, భాస్వంత్ శర్మ చేసిన సంగీత కచేరి అలరించాయి.



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

వేములవాడ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి వారి ఆరాదనోత్సవాల్లో భాగంగా కళాకారులు నిర్వహించిన కచేరీలు, కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శనివారం రాత్రి 8 గంటలకు భోగ ధర్మరాజు బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కళాకారులను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సన్మానించారు.



న్యూస్ బాక్స్

మాల మహానాడు నాయకులపై చర్యలు తీసుకోండి

ఎలిగేడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు నాయకులపై చర్యలు తీసుకోవాలని మండల ఎంఆర్పీఎస్ నాయకులు స్థానిక అంబేడ్కర్‌చౌక్‌లో నిరసన తెలిపి జూలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 17న గోదావరిఖనిలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, జాతీయ అధ్యక్షుడు పసుల రామూర్తి చేసిన వాఖ్యలు యావత్తు మాదిగ జాతిని అవమానించిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని వారు ఎస్సైకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బాసంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి కవ్వంపల్లి సంపత్, నాయకులు దుర్గయ్య, నారాయణ, శంకర్ తదితరులు ఉన్నారు.

ఎంఈవోకు హెచ్‌ఎంల అభినందనలు

ధర్మారం జనవరి 18 (ఆంధ్రజ్యోతి) నూతనంగా నియమితులైన ధర్మారం మండల ఎంఈఓ పోతు ప్రభాకర్‌ను మండలంలోని ప్రధానోపాధ్యయులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్, ఎస్.మల్లారెడ్డి, నూతి మల్లయ్య, ఈరవేని రాజ్ కుమార్, వేల్పుల రాజ్ కుమార్, జి.నాగరాజు, జి. రాజేష్, వి.రాజేందర్‌రెడ్డి, కోట శశిధర్, కాటం మధునయ్య, శ్రీనివాసరెడ్డి, జి.సంజీవ్, ఉపాధ్యాయులు కందుకూరి భాస్కర్, సముద్రాల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ధర్మారం జనవరి 18 (ఆంధ్రజ్యోతి) ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలపాలైన విద్యార్థికి శనివారం పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందించారు. ఈనెల 11న ఇంటి పైన పతంగి ఎగురవేస్తూ కోనేటి వంశీ అనే ఆరవ తరగతి విద్యార్థి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. శనివారం ధర్మారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలతీ లత ఉపాధ్యాయులు అరుణ, వెంకటేశంలతో కలిసి విద్యార్థిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు వంశీ వైద్య ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.

ఏఎంసీ చైర్మన్‌కు పరామర్శ

ధర్మారం జనవరి 17 (ఆంధ్రజ్యోతి) ధర్మారం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్‌ను చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. ఇటీవల రూప్లానాయక్ తండ్రి లావుడ్య రత్నా నాయక్ అనారోగ్యంతో చనిపోగా శనివారం స్వగ్రామమైన లంబాడి తండా (బి)లో నివాళులు అర్పించారు. ఆయన వెంట ధర్మారం బ్లాక్-2 కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాడే సూర్య నారాయణ, పాలకుర్తి రాజేశం గౌడ్, దేవి జనార్ధన్, మార్కెట్ డైరెక్టర్లు కాంపెల్లి రాజేశం, గంధం మహిపాల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోగాల తిరుపతి, ఓరెం చిరంజీవి, ఎండి హఫీజ్, దేవి అఖిల్, పొన్న కృష్ణ, పొన్నవేని స్వామి, ఎండీ అష్ను, దేవి రాజలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ సూపరింటెండెంట్‌కు ఆత్మీయ వీడ్కోలు

రామగిరి, జనవరి18 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా సేవలు అందించి హైదరాబాద్ యూనివర్సిటీకి బదిలీపై వెళ్తున్న రవికుమార్‌ను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శనివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, డిఇఇ సతీష్‌కుమార్, లైబ్రరీ ఇంచార్జి రమణ పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు..

డోర్ అలారమ్ తాళాలను వినియోగించండి

- సీపీ శ్రీనివాస్
- యాంటీ థెఫ్ట్ అలారం సిస్టంపై డెమో ప్రదర్శన



డోర్‌కు యాంటీ థెఫ్ట్ అలారం బిగిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీల నియంత్రణకు ప్రజలు డోర్ అలారమ్ తాళాలను వినియోగించుకోవాలని రామగుండం పోలీస్‌కమిషనర్, ఐజీ శ్రీనివాస్ సూచించారు. యాంటీ థెఫ్ట్ అలారం లాక్, మ్యాగ్నెటిక్ యాంటీ తెఫ్ట్ అలారం లాక్‌లను తలుపులు, కిటికీలకు వినియో గించుకోవడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో యాంటీ థెఫ్ట్ అలారం లాక్, మ్యాగ్నెటిక్ యాంటీ తెఫ్ట్ అలారం లాక్‌ల వినియోగంపై విలేకరులకు డెమో ద్వారా వివరించారు. ఇటీవల కాలంలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి తాళాలు వినియోగించుకోవడం ద్వారా చోరీలను అదుపు చేయవచ్చునన్నారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని, మన జీవన విధానంలో టెక్నాలజీ ఒక భాగమైందన్నారు. ఇంటి యజమానులు ఇతర ప్రాంతాలకు ఇంటికి తాళం వేసి వెళ్లిన సమయంలో ఎవరైన ఇళ్లలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తే వారి ప్రయత్నాన్ని ఆపే సమర్థవంతమైన నిరోధకమే యాంటి థెఫ్ట్ అలారమ్ లాక్ అని వివరించారు. తలుపు గడియలు ముట్టినా, తాళం ముట్టినా, తలుపును నెట్టినా అలారం శబ్దం రావడం వల్ల చుట్టు పక్కల వారిని అలర్ట్ చేస్తుందన్నారు. ఇంటికి తాళాలు వేసి బయటకు, ఊర్లకు వెళ్లేవారంతా యాంటీ తెఫ్ట్ అలారం లాక్‌లను తలుపులు, కిటీలకు బిగించుకుని వినియోగించుకోవాలన్నారు. డోర్ అలారాలు చాలా ప్రభావంతమైన గృహ భద్రత పరికరాలని, ఎవరైనా తలుపు తెరిస్తే, తెరవడానికి ప్రయత్నించినా శబ్దం వస్తుందన్నారు. ఇంటి ప్రధాన ద్వారాలు, వెనుక, సైడ్, గ్లాస్ గార్డెన్ డోర్లు, సెల్లార్ డోర్లు, బీరువా తలుపులు, కార్యాలయాలు, గిడ్డంగులు, పారిశ్రామిక ప్రాంతాలు, నివాస గృహాలు, గ్యారేజీలు, దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లతో సహా వీటిని వినియోగించుకోవచ్చునన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ కిటికీలకు కూడా వీటిని వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ సెక్యూరిటీ అలారాలు 105నుంచి 110 డీబీతో మోగుతాయని, చాలా దూరం వరకు శబ్దం రావడంతో కాలనీల వారిని అలర్ట్ చేస్తుందన్నారు. ఈ కామర్స్ సైట్స్ అయిన అమేజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో ఈ యాంటీ థెఫ్ట్ అలారాలు అందుబాటులో ఉన్నాయని, రూ.300 నుంచి రూ.500 బడ్జెట్‌లో దొరుకుతున్నాయన్నారు. ఇవే కాకుండా ప్రతి ఇంటి వద్ద ఆధునిక సీసీ కెమెరాలు వినియోగించాలన్నారు. మార్కెట్‌లో 3000 ధరల్లో కూడా కార్డ్ లెస్ సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, బయట వారికి కనబడకుండా వీటిని వినియోగించవచ్చునని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆర్ఐ దామోదర్ పాల్గొన్నారు.

బస్ డిపోకు రూ. 11.7 కోట్లు

(5వ పేజీ తరువాయి)

బహిరంగ సభా వేదిక నుంచి వర్చువల్‌గా పెద్దపల్లి బస్ డిపోకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నుంచి బస్ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న చెట్లను తొలగించారు.

● త్వరలోనే బస్ డిపో పనులు

- సీహెచ్ విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే



పెద్దపల్లిలో ఆర్టీసీ డిపో ఏర్పాటు కానుండడంతో ఈ ప్రాంత చిరకాల వాంఛ నెరవేరనున్నది. డిపో నిర్మాణానికి ఆర్టీసీ బోర్డు 11 కోట్ల 70 లక్షల రూపాయలు మంజూరు చేసింది. త్వరలోనే అంచనాలు రూపొందించి పనులను మొదలు పెట్టనున్నారు. ఆర్టీసీ డిపో మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డిపో మంజూరుకు సహకరించిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

- లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ గణేష్



సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్, మెజిస్ట్రేట్ గణేష్

ఓదెల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు న్యాయం అందించేందుకు తెల్ల రేషన్ కార్డులున్న ప్రతీకక్షిదారుడు దరఖాస్తులు అందజేస్తే, వారికి అడ్వకేట్‌ను కేటాయించి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సుల్తాన్ బాద్ సివిల్ కోర్టు జడ్జి గణేష్ తెలిపారు. మండలంలోని కనగర్తి హైస్కూల్‌లో శనివారం సుల్తానాబాద్ సివిల్ కోర్టు జడ్జి, లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ గణేష్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. తరచుగా గొడవలకు దిగడం, ఆర్థిక నష్టాలకు గురవుతూ కోర్టుల వెంట తిరగడం కంటే, రాజీ మార్గం ఉత్తమమైన మార్గమని తెలిపారు. మహిళలు, యువతలకు ఎలాంటి సమస్యలు వచ్చిన కేవలం లేఖలు రాస్తే చాలు స్పందిస్తామని తెలిపారు. సదస్సులో ఆర్టిఐ, రోడ్డు భద్రత, నిర్భయ చట్టాలు, క్రయ,విక్రయాలు, అప్పు పత్రాలు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెకండ్ మెజిస్ట్రేట్ శంకరయ్య, ఎంఈవో రమేష్, ఏజీపీ అంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, ఆకారపు సర్వోత్తమ్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రావు, ఎస్ఏ వెంకటరమణ, భూమయ్య, శివకృష్ణ, ఏఎస్ఐ వీరస్వామి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గుండాలు దాడిచేయడం సిగ్గుచేటని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం హేయమైన చర్య అని, కాంగ్రెస్ నాయకులు రాజకీయాలను భ్రష్టు పటిస్టున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ప్రతీ ఎకరాకు నీరు అందించారని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అందించాలని ప్రశ్నించినందుకు సుంకె రవిశంకర్ ఇంటిపై దాడిచేయడం సరైంది కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతున్నారని, బెదిరింపులకు గురిచేస్తున్నారని, కాంగ్రెస్ నాయకులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రవి శంకర్ ఇంటిపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. దాడికి ప్రోత్సహించిన ఎమ్మెల్యేపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మారుతి, శ్రీనివాస్, అచ్చె వేణు, రాకం దామోదర్, జక్కుల తిరుపతి, తిమోతి, సట్టు శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావణ్, కిరణ్, నీరటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మార్కండేయకాలనీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రామగుండం బ్రాంచ్ అధ్యక్షుడు క్యాన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీవాణి, మెడికల్ షాప్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కే రాజేందర్ సూచించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్ సభ్యుల కోసం ఐఎంఏ ఆధ్వర్యంలో సిగ్మా హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ళ శ్యామ్‌సుందర్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ దుర్గాప్రసాద్, శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ భైరం సతీష్, క్లబ్ సీనియర్ మెంబర్స్ కోల లక్ష్మణ్, అల్లంకి లచ్చయ్య, జక్కం మారుతి, దయానంద్ గాంధీ, కే చంద్రశేఖర్‌రెడ్డి, కేఎస్ వాసు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

కళ్యాణ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు పిడుగు కృష్ణ, మాడ నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారికి 250గజాల స్థలం, గుర్తింపు కార్డు, బస్‌పాస్, రైల్వే పాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలైన చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ ప్రభుత్వాలు ఉద్యమకారులను గుర్తించి నట్లే తెలంగాణలో కూడా ఉద్యమకారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఫోరం నాయకులు తోడేటి శంకర్‌గౌడ్, అనుముల కళావతి, శంకర్‌నాయక్, వీరాలాల్, మల్లేషం, మామిడి వీరేశ్, రాజ్‌కుమార్, బుంగ మహేష్ పాల్గొన్నారు.

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు ఘన నివాళి



గోదావరిఖనిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు శనివారం ఘన నివాళి అర్పించారు. పెద్దపల్లి పట్టణంలోని అయ్యప్ప గుడి చౌర స్తా వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ భూత గడ్డ సంపత్, రంగాపురం మాజీ సర్పంచ్, కలవేన మహేందర్, భీమోజు సురేందర్, బొడ్డుపల్లి అశోక్, తాళ్ల కళ్యాణ్, కొప్పుల మురళి, జాపతి సత్యం పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖనిలోని గాంధీనగర్ లోగల టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ మాజీ రాష్ట్రకార్యదర్శి, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గాంధీనగర్ లోని అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు పండ్లు అందజేసి కార్యాలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, గుండబోయిన ఓదెలు, రాజలింగం, రాజనర్సు, వీరేందర్, కొండి శ్రీనివాస్, నారెడ్డి స్వరాజ్యం, నర్మదా, చిట్యాల అశ్విని, బరిగెల కళావతి, రొడ్డ బాణమ్మ, రాజేశ్వరి, సుందిళ్ళ స్వామి, లింగమ్మ, నర్సయ్య పాల్గొన్నారు. టీడీపీ రామగుండం కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు కోటగిరి పాపయ్య ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, నాయకులు సంగెపు రాజు, నారాయణ, రాజేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

మంథని: మాజీ సీఎం నందమూరి తారక రామారావు తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మంథనిలో ఆయన, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విగ్రహానికి శనివారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి గుండెల్లో చెరగని గూడు కట్టుకున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు అన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- అదనపు కలెక్టర్ వేణు



అకెనపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

కాల్వశ్రీరాంపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చూడాలని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ వేణు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అడిగి తెలుసుకన్నారు. అనంత రం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నాలుగు సంక్షేమ పథకాలపై మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ వకీల్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, వ్యవసాయ అధికారి నాగార్జున, ఆర్ఐలు రాజేందర్, అజీమ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఓదెల: ప్రభుత్వం విధించిన గడువులోగా వ్యవసాయ సాగు యోగ్యత లేని భూముల సర్వేను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు కోరారు. శనివారం ఓదెల రైల్వే పాత క్వార్టర్ల సమీపంలో వ్యవసాయ సాగుకు యోగ్యత లేని భూములను గుర్తించారు. ఈ సందర్భంగా భూములను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిర్ధిష్ట సమయం లోపు జిల్లాలోని సాగుకు యోగ్యత లేని భూములను సర్వే పూర్తి చేయాలన్నారు. ఇందుర్తి, ఓదెల పరిధిలోని కొంత సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకయ్య, ఏవో భాస్కర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సంధ్య , కిరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో అదనపు కలెక్టర్ వేణు పర్యటిం చి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమన్, అధికారులు పాల్గొన్నారు.

● ఆర్డీవో ఆకస్మిక తనిఖీ..

అంతర్గాం: మండలంలోని అకెనపల్లి గ్రామంలో రైతు భరోసా, మూర్మూర్ గ్రామంలో రేషన్ కార్డు సర్వేను పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన వెంట తహసిల్దార్ తూము రవీందర్, పెద్దపల్లి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే ల్యాండ్ రికార్డ్ శ్రీనివాసులు ఉన్నారు.

పరీక్షలు ఉన్నాయి కాలేజీకి రండి



విద్యార్థితో మాట్లాడుతున్న అధ్యాపకులు

ముత్తారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీ నుంచి అర్ధవార్షిక పరీక్షలు ఉన్నాయని కాలేజీకి విద్యార్థులు కాలేజీకి రావాలని అధ్యాపకులు కోరారు. మండల కేంద్రంలో ఓ విద్యార్థి పొలం వద్ద పనులు చేస్తుండగా అధ్యాపకులు విద్యార్థి వద్దకు వెళ్లి పరీక్షలు ఉన్నాయి వచ్చి చదువుకోవాలని.. పరీక్షలు రాయాలి అని విద్యార్థికి కౌన్సెలిం గ్ నిర్వహించారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

గోదావరిఖని, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి ఆర్‌జీ-1 ఏరియా ఆధ్వర్యంలో ఆయుర్వేద మెడికల్ క్యాంపును నిర్వహిం చనున్నట్టు ఆర్‌జీ-1 అధికార ప్రతినిధి కిరణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మెడికల్ క్యాంపు నిర్వహించనున్నారు.



జూట్ బ్యాగ్ తయారీ శిక్షణ తరగుతులు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వకీల్‌పల్లె గని ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రేమేడియేషన్స్ మేషర్స్ కింద ఆర్జీ-2 సింగరేణి యాజమాన్యం ప్రభావిత గ్రామమైన పెంచికల్‌పేట్‌లో శనివారం జూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించింది. గ్రామంలోని కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యక్రమంలో జీఎం బండి వెంకటయ్య, సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్యలు ప్రారంభించారు. వృత్తి శిక్షణ ద్వారా మహిళలు ఆర్థిక స్థిరత్వం పొందాలనేది ముఖ్య ఉద్దేశమని జీఎం పేర్కొన్నారు. ప్రభావిత గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పన, మహిళలకు ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా ప్రోత్సహించేలా పలు వృత్తి శిక్షణా కోర్సుల్లో సింగరేణి శిక్షణ ఇస్తున్నట్టు జీఎం తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని జూట్ బ్యాగ్‌లను అధికమొత్తంలో తయారు చేయాలని, వాటికి మంచి మార్కెట్ ఉన్నట్టు వెంకటయ్య అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, పెంచికల్‌పేట్ గ్రామ కార్యదర్శి తిరుపతి, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్‌తో పాటు గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

ఓసీపీ-2 కార్మికుల ఉదారత

రామగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2 రిలే కార్మికులు తమ ఉదారతను చాటుకున్నారు. మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నరేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని శనివారం సెంటినరీకాలనీ లయన్స్‌క్లబ్ సభ్యుడు మేకల మారుతీ సౌజన్యంతో ఓసిపి-2 రిలే కార్మికులు ఏడు వేల రూపాయల విలువ గల నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంటవెంకటరమణరెడ్డి, వెము కనకయ్య, సంజీవ్, మర్రి సంతోష్, పిడుగు సురేష్, రమేశ్, అనవేని శ్రీనివాస్, సన్నీ పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్యంపై అవగాహన



జీఎంకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గోదావరిఖని, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 జీడీకే ఇంక్లైన్ కార్మికులకు సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యులు శనివారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఏరియా హాస్పిటల్ డీవైసీఎంఓ ఆర్ కిరణ రాజ్ ఆధ్వర్యంలో డాక్టర్ కే పద్మ ఉద్యోగులు ఆరోగ్యంగా జీవించడం కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. హెచ్‌ఎంపీవీ వైరస్, బీపీ, మధుమేహం లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. శీతల పానీయాలు, మద్యం సేవించడం ఆరోగ్యానికి హాని కలిగిస్తుందన్నారు. తాజా పళ్ళు, కూరగాయలు బీన్స్ వంటి ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ బీ మల్లేశం, గని సేఫ్టీ ఆఫీసర్ ఎం మల్లేష్, సంక్షేమాధికారి రవీందర్, గని పిట్ సెక్రెటరీ నాయిని శంకర్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన పెంచికల్‌పేట్‌లో శనివారం సింగరేణి ఆర్జీ-2 యాజమాన్యం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించింది. వకీల్ పల్లె గని పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రేమెడియేషన్ కింద గ్రామంలోని కమ్యూనిటీహాల్‌లో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటును యాజమాన్యం ఏర్పాటు చేసింది. జీఎం బండి వెంకటయ్య మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. గ్రామస్థులకు సింగరేణి స్పెషలిస్టు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, పెంచికల్‌పేట్ గ్రామ కార్యదర్శి తిరుపతి, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, మెడికల్ సూపరెండెంట్ డా. మహిపాల్, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, పర్యావరణ అధికారి వేణు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆంతోని నాగేశ్వరరావు, ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ బొక్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: ఆర్జీ-3 డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రఘుపతి, జనరల్ సెక్రటరీ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆర్జీ-3, ఏపీఏలో ఘనంగా బొమ్మల కొలువు



బొమ్మల కొలువు వేడుకలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

రామగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్ పరిధీలోని సెంటినరీకాలనీ సిఎన్‌సీవోఏ క్లబ్‌లో శనివారం లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువును ఘనంగా నిర్వహించారు. ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు, విజయలక్ష్మీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన బొమ్మల కొలువు వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ పర్సనల్ జి వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లబ్‌లో ప్రత్యేకంగా అలకరించిన వేదికపై ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గోదా కల్యాణ ఘట్టం, లక్ష్మీనరసింహస్వామి, వినాయకుడు, కృష్ణుడు, దేవీ, దేవతలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్జీ-1,2 ఏరియాల సేవా అధ్యక్షురాళ్ళు అనితలలిత్‌కుమార్, వనజా వెంకటయ్య, లతితా గుప్త, గీతారాణి, హరిణి, ప్రసూన, లావణ్య, నిఖిత, కోమలి, లేడీస్ క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై కార్మికులకు అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు

కోల్‌సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జీడీకే 1ఇంక్లైన్‌పై సింగరేణి కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు రోడ్డు భద్రత గురించి సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాల ఫిట్‌నెస్‌లు, ఇన్సూరెన్స్‌లు, ఇతర డాక్యుమెంట్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.